
● కేతు విశ్వనాథరెడ్డి
● చిత్రాలు: వి.ఆర్. పాళాల



అమ్మేయ్! ఎన్ని రోజులకే బట్టలెత్తేది? రోజూ చలవ బట్టలు తెచ్చే కాలం పాయె. సరే, వారానికి మూడు సార్లు తెచ్చేది పాయె. పోనీ, వారం వారం అంటూ వచ్చేదీ పాయె. పదైదు రోజుల కాలం పాయె. ఇప్పుడు నెలనా?"

"ఏం చేస్తము తల్లీ? నీకు తెల్దా? వంకలు ఎండిపాయె. కపిల బావులు మట్టిగొట్టుకొని పాయె. ఇంజన్లు పాయె. కాలవలోనన్నా ఉతుకుదామంటే, బోరింగులొచ్చె గదమ్మా! యాడ చస్తాం? ఎన్నిండ్ల మొదలో నీకు తెల్దా తల్లీ? రైతులిచ్చే మేరలూ పాయె. ఇనాములూ పాయె గదమ్మా."

"పోతే ఏం తెగులైంది? సెతుర్లు మాట్లాడతావు, ఏడో తరగతి చదివినానని. మీకు బడాశలే అమ్మేయ్?"

"ఏం బడాశ మాయమ్మా? నాలుగెకరలేమన్నా కొన్నామా? ఆ ఆశే ఉంటే మా తమ్ముని మాదిరి టౌను చేరుకొని ఉండేవాళ్ళం. మా మరిది మాదిరిగా తాడిపర్తి సిమెంటు ఫ్యాక్టరీ పనికి పోయుండేవాళ్ళం. మా కులపోళ్ళలో కొంత మంది మాదిరి ఫ్యాక్టరీ ఆఫీసర్ల బట్టల్ని నమ్ముకునేవాళ్ళం. ముండమోసిన మా యత్తా, నేనూ రైతుల్ని విడిచిపెట్టలేదు గదమ్మా?"

"అది గాదే. మీరుండేదేమో ఇద్దరు. రెడ్డేరిండ్లూ కావాల, కమ్మోళ్ళ ఇండ్లూ కావాల."

"మాయ కాలమొచ్చి ఇట్లా మాట్లాడతా ఉండావు మల్లమ్మ తల్లీ. ఇప్పటికి మిగిలింది ఈ పల్లెలో అయిదిండ్లే. మన రెడ్డేరివి మూడు. కమ్మోళ్ళవి రెండూ. మూడు నాలుగు తరాల నుంచి చేస్తున్నవే. అయినా, ఒక్కమాట అడుగుతాను చెప్పు తల్లీ? నువ్వు పెద్ద మనసున్నదానివి. రెడ్డోరి మైల గుడ్డలు వేరు. కమ్మోరి మైల గుడ్డలు వేరూనా? ఉతకడానికి మైలంతా ఒకటే గద తల్లీ మాకు. నిన్నమొన్న ఎన్టీరామారావు వచ్చేదాకా మీ రైతులందరూ ఒకటే గాదా? చంద్రబాబు నాయుడొచ్చినాక..."

"అమ్మేయ్! నీతో మాట్లాడడం నాదే తప్పు. నీ తెలివితో నేనెక్కడ ఏగుదు? మీ అత్త అందుకే నిన్ను పంపుతుంది. అవును, మైల గుడ్డలన్నీ ఒకటే అయితే మాదిగోళ్ళవి ఉతుకుతావా? చెప్పు!"

"మల్లమ్మ తల్లీ! ఏదో నీదగ్గర వాగుతుండా. ఆ గొడవల్లోకి దించొద్దు. నీకు పుణ్యముంటుంది. మనసులోది చెప్పాలంటే, బాపనోళ్ళ మడికి కులముంటుందేమోగానీ, ఎవరి మైల బట్టలకూ కులముండదు. మాపుడులో తేడా అంతే. కుళ్ళ మాపుడూ, మామూలు మాపుడూ, మైల పోగొట్టడానికి కొన్ని బట్టలకు సవుడు దండిగా పెట్టాలి. కొన్నిటికి తక్కువ పెట్టాలి. కొన్నిటిని బండ మీద ఇస్సో ఇస్సో మంటూ బాదాల. మాకు తెలిసిన చదువు అదే."

తల్లికీ, ఇంటి చాకలికీ మధ్య జరిగిన మాటలను బ్రహ్మం శ్రద్ధగా విన్నాడు. టెలివిజన్ కార్యక్రమాలను చూడడం ఆపివేశాడు. చాకలిని పేరుతో పిలవక పోవడం గమనించాడు. తాను చదవని విషయాలూ, స్కూల్లో చర్చించని సంగతులూ అవి అనుకున్నాడు. 'ఇస్సో ఇస్సో' నవ్వు తెప్పించింది.

మెచ్చుకోలుగా అన్నాడు: "రాములమ్మా! నువ్వు బాగా చెప్పినావు. మైలకు కులం లేదు. మనుషుల్ని ఉతికి మైల పోగొట్టి, చలవ చేసేట్లున్నావు!"

"అమ్మో మల్లమ్మ తల్లీ! చిన్రెడ్డి అంతా విన్నాడు. పెద్ద చదువు చదువుకున్నోడు. చిన్రెడ్డికి తెలిసినంత నాకేం తెలుస్తుందమ్మా." రాములమ్మ నవ్వుతూ వినయంగా అంది.

తన కొడుకును మెచ్చుకున్నందుకు బ్రహ్మం తల్లి ఎంతో మురిసిపోయింది. "ఇంత సంగటి తినిపో" అంది. వంటింట్లోకి వెళ్ళి ఒక చిన్న సంగటి ముద్దనూ, ఇంత కూరనూ తెచ్చి తళ్ళెలో పెట్టింది. మంచినీళ్ళ చెంబు తెచ్చి ఇచ్చింది. బ్రహ్మం తల్లి గుడ్డలు లెక్క పెట్టసాగింది. బ్రహ్మం పుస్తకం చదువుకుంటూ, మధ్య మధ్యలో గమనిస్తున్నాడు. రాములమ్మ తింటున్న ముద్దవైపు చూసి అనుకున్నాడు.

'ఇప్పుడు ఒకే ముద్ద. తిన్నంతా కాదు. ఇంటికి తీసుకుపొయ్యేదీ కాదు. అదీ ఈ ఇంట్లో. అబ్బ(నాన్న నాన్న) కట్టడి. ఒకప్పుడు తాను పసితనంలో రాములమ్మ అత్త తింటున్న అన్నం పెట్టమని గొడవ చేసేవాడు. తినేవాడు కూడా. తల్లి కసిరేది. నాయన తిట్టేవాడు. అబ్బ నవ్వుతూ సమర్థించేవాడు.

"అమ్మేయ్! కోడలి చీరె ఒకటి తేలేదే ఎర్ర గన్నేరు పువ్వు రంగుది." తల్లి అంది.

"రేపు మల్లా రావాలి. తెస్తాలేమ్మా. ఇన్ని మజ్జిగ పొయ్యి. ఎండలో నడిచి పోవాల" అంది రాములమ్మ మాట మార్చి. బ్రహ్మం తల్లి గొణిగింది.

"ఆ ఒక్క ఎనుమూ ఇచ్చే పాలు మాకే చాలడం లేదు. మా మామ ఊళ్ళో ఉంటే కాఫీలకూ, టీలకూ సరిపోతాయి వచ్చే వాళ్ళకూ, పొయ్యేవాళ్ళకూ. సరేలే నీకు మజ్జిగ పోస్తానే మా ఆన్నులు తరిగిపోవు." లోపలికి వెళ్ళి పల్చటి మజ్జిగ తెచ్చి రాములమ్మ తళ్ళెలో పోసింది. రాములమ్మ తినడం పూర్తి చేసింది. తళ్ళె కడిగి అరుగు మీద పెట్టి బ్రహ్మన్ని అడిగింది. "చిన్రెడ్డీ! మీ అబ్బ పెద్దరెడ్డి మా అనుమంటోళ్ళకు పక్క పల్లె కాడ కొండ కింద ఇండ్ల పట్టాలిప్పిస్తున్నాడంట! మా చిన్న చెల్లెలు ఆ పల్లెలోనే కదా ఉండేది. పట్టా ఇప్పించమని చెప్పు. నీ మాటంటే మీ అబ్బకు గురి. మీ అబ్బ మాదిరే నీది పెద్ద మనసు."

ఖాళీ బిందెను చంకనేసుకొని, బోరు నీళ్ళకు వెళ్ళబోతున్న బ్రహ్మం తల్లి ఇది వింది. పోతూపోతున్నదీ ఆగి అంది. "ఓమ్మేయ్! చిన్రెడ్డి అబ్బ ఉండాడే, అదే మా మామ ఇండ్ల పట్టాలేంది, భూముల్ని కూడా ఇప్పిస్తాడు మీలాంటోళ్ళకు. పేరు రావాల. ఇంటి అతీ గతీ పట్టదు. ఇండ్లు దాటి మూడు రోజులైంది."

"మాటవరసకు అన్నాన్లే మల్లమ్మ తల్లీ. పెద్దరెడ్డి ధర్మాత్ముడు అమ్మా! ఇంటిపని చూసుకోడానికి మా రెడ్డి ఉండె. మీ పెద్ద కొడుకు చిన పెదరెడ్డి ఉండె." రాములమ్మ మాసిన బట్టల మోద తీసుకొని పోతూ పోతూ అంది. బ్రహ్మం తల్లి బిందెను ఒక కంబం వార ఉంచి దొడ్లోకి వెళ్ళింది, నడవలోకి వచ్చిన కోడిపిల్లల్ని తరుముతూ. బ్రహ్మం మనసులో తన అబ్బ మెదిలాడు.

ఆయన తీరే అంత. డెబ్భయ్ అయిదేళ్ళు కావస్తున్నా వాళ్ళపనీ, వీళ్ళపనీ అంటూ తిరుగుతూనే ఉంటాడు. స్వాతంత్ర్యం రాకముందు కొంతకాలం జాతీయవాది. కొంత కాలం కమ్యూనిస్టు. చీలికల రాద్ధాంతాల్లో, ఎన్నికల పొత్తుల వ్యూహాల్లో ఇమడలేక తనకు తోచింది తాను చేస్తూ పోతున్నాడు. పేదా సాదకు మంచి చేస్తున్నాడని పేరు పల్లెల్లో. ఇంట్లో ఖాళీగా ఉంటే తోటపనికి పోతాడు. తోట దగ్గరకు ఎవరో వెళ్ళడం, ఆయన అటునుంచే ఏ పల్లెకో, పేటకో పోవడం. జేజి (నాన్నమ్మ) చనిపోయినాక ఆయన వ్యాపకం పూర్తిగా అదే అయింది. తన తండ్రికి అబ్బంటే గౌరవం. అన్నకు మాత్రం చులకన. కాంగ్రెసుకూ, తెలుగుదేశానికీ రెండింటికీ వ్యతిరేకమేనని, మనకంటే 'పేదోళ్ళు లేరా' అంటూ ఏ గొడవల్ని తెచ్చిపెడతాడో నని. మనకు ఎవరు మేలు చేస్తే వాళ్ళవైపు ఉండాలనేది అన్న వాదం. ఆ మేలనేది ఎప్పుడైనా కావచ్చు. ఏదైనా కావచ్చు. ఎక్కడైనా కావచ్చు.

తల్లి పిలుపుతో బ్రహ్మం లోకంలోకి వచ్చాడు. "అబ్బీ బ్రహ్మం! నీకు పని చెప్పాలంటే నోరు రాదు. నెలకొక్కసారి ఇంటికొస్తావు. ఊళ్ళో పలికే మనిషి లేడు. కానికాలం వచ్చింది. మీ నాయనకు తోట కాడ పని. మీ వదినకూ అక్కడ పని సరిపోతుంది. గడ్డో గాదమో, కలుపో గిలుపో, ఏదో ఒకటి. మీ నాయన బయటకి ఎక్కడన్నా పోతే మోటరు ఆడించి మడవ గట్టేది కూడా మీ వదినే. మీ అన్న ఏదో వ్యాపారం గీపారం అంటాడు. ఇంటిపట్టున ఉంటే ఒట్టు. ఈ పొద్దు మీ నాయన ఊళ్ళో లేడు. మీ వదిన తోట కాడుంది. మన ఇంటిని నమ్ముకున్న ఆ ముసలోడు ఉప్పరి కొండయ్య ఉండాడనుకో. నాలుగు బిందెలు కొట్టియ్యి అబ్బీ!"

తల్లి ముఖంలోని అలసట, గుబులు చూసి బ్రహ్మానికి జాలివేసింది. ఎవరిమీదో తెలియని కోపం వచ్చింది. మౌనంగా, ఇంటికి నూరు గజాల దూరంలోని మంచినీళ్ళ బోరు వద్దకు తానూ ఒక బిందె తీసుకొని నడిచాడు. ఆ ఇంట్లో మనుషులకూ, పశువులకూ, వచ్చీపోయే బంధువులకూ కనీసం యాభై బిందెలైనా నీళ్ళు కావాలి. ఒక్కొక్కప్పుడు అవి డెబ్భయ్యో, ఎనభైయ్యో, నూరో. జలశ్రమ! ఇరవై బిందెలు నీళ్ళు కొట్టి, తల్లితో పాటు తానూ తెచ్చి పోశాడు. తల్లి అలసట తీర్చుకోడానికి, కాళ్ళు, ముఖం కడుక్కొని, చీర చెరుగుతో ముఖం తుడుచుకుంటూ ఒక కంబం దగ్గర కూచుంది. బ్రహ్మం టీవీ దగ్గర కూర్చున్నాడు. సందేహిస్తూనే బ్రహ్మంతో తల్లి అంది

"అబ్బీ బ్రహ్మం! మీ వదినకూ, కొండయ్యకూ అన్నం ఇచ్చిరా. ఆ ఆడపిల్లలిద్దరున్నా ఇట్లాంటి సాయం చేసేవాళ్ళు. పాత పల్లెకు వెళ్ళి ఇంకా తిరిగి రాలేదు. వాళ్ళ అవ్వా, తాత ఎప్పుడు పంపుతారో. ఇప్పటికే చానా ఆలస్యమయింది. నాకింకా ఇంట్లో తెమలనంత పని ఉంది. ఆఁ... కొండయ్యకు చెప్పు సందేల తోటకాడున్న కట్టెపుల్లల్ని ఇంటికి పంపమను. మీ అన్న ఎక్కడుండేదీ ఆ ముసలోడికి తెలుసులే. ఎట్లాగో చెప్పి పంపుతాడు. మీ అన్న ఎవరితో ఒకరితోనో కట్టెలు పంపుతాడు. మనకు బండీలేదు. కాడెద్దులూ లేవు. ఏం చేస్తాం?" తన

ఆరేడెకరాల తోట వ్యవసాయమూ బాడుగల మీద ఆధారపడి ఉందని బ్రహ్మానికి తెలియంది కాదు. మెట్ట పొలమూ, బండ్లూ బరకట్లూ, ఎద్దులూ, ఆఖరుకు మడకలూ, గొర్రెలూ అమ్మి నాలుగైదేండ్లు అయిందని తెలుసు. తల్లి ఇచ్చిన అన్నం గంపను ఎడమ అరచేతి మీద పెట్టుకొని భుజానికి మోపుగా, తోటకు బయలు దేరాడు. ఊరికి దూరంగా కిలో మీటరుకు పైగా నడిచి చేరుకోవలసిన తోట. బండ్ల బాటలో వెళ్తే రెండు కిలోమీటర్లు పైగా నడవాలి. బ్రహ్మం కాలిబాటలోనే బయలుదేరాడు. గుట్టకింద రాళ్ళూ రప్పల కాలిబాట. కాలిబాటకు అటూ ఇటూ ఎర్రనేలలు. కొన్ని తువ్వ నేలలు. ఒకటి రెండు తోట కట్టు పొలాలు తప్ప అన్నీ మెట్ట చేలు. పేరుకు మాత్రం పండీపండని ఎకరాలు ఎకరాల భూములు.

**“రాములమ్మా! నువ్వు బాగా చెప్పినావు. మైలకు కులం లేదు. మనుమళ్ళు ఉలికి పైకి పోతాట్టి, కులపి చేసెట్టున్నావు!”**



ఒక దగ్గర కాలి బాట పక్క, ఒక చేనిగట్టు వార కొందరు పిల్లలు ఎదురయ్యారు.

చంపిన ఒక తొండను తోక పట్టుకొని ఊపుతూ, సన్నగా చిన్న పీరు కర్రలాగా ఉండే ఏడెనిమిదేళ్ళ పిల్లవాడు పక్కా ఇకిలిస్తున్నాడు, మరో ఇద్దరు పిల్ల వాళ్ళ మీదికి విసురుతున్నట్లు నటిస్తూ, ఆ ముగ్గురికి ఎడంగా ఉండే కాస్త నదురైన పదిపదకొండేళ్ళ వాడు తొండ విజయుడితో ఎకసెక్కంగా అన్నాడు:

“అబ్బబ్బ చూడండ్రా వీణ్ణి! పెద్ద పోజు సినిమా హీరో మాదిరి. చంపి చంపి కుంటి తొండ బీకెను చంపినాడు, పెద్ద మొగోని మాదిరి. ఆ చంపిందీ మునలి తొండబీకెను. అదిగదిగో! ఆ పారిపోతాందే ఆ వగిసె దాన్ని వెంటబడమను. ఒకే ఒక్క రాయి తీసుకొని ఒకే ఒక్క ఏటుకు చంపమను తెలుస్తుంది వీని పస, దయిర్యం!”

పిల్లలకు బ్రహ్మం దగ్గరగా వచ్చి నిలిచాడు. చచ్చిన తొండను పట్టుకున్న పిల్లవాడు భయంతో దాన్ని కిందికి జారవిడిచాడు. తొండను బ్రహ్మం చూశాడు. తొండ మూతి నుజ్జునుజ్జు అయింది. ఎర్రటి రక్తం చారికలు తప్ప మూతి ఆకారం స్పష్టంగా కనిపించలేదు. పొట్ట పగిలి ఉంది. బ్రహ్మానికి వెలపరం పుట్టింది. ఎక్కడో ఏ మూలో భయం కూడా వేసింది. తొండ విరూపం చూసి.

“ఇంతకంటే వేరే ఆటల్లేవేమ్రా” అన్నాడు.

పిల్లలు మారు మాట్లాడలేదు. వెనక్కి పరుగెత్తారు. పిల్లలకు తన ముఖంలో తమ అయ్యవారు కనిపించి ఉండాలి. ఇంకా పెద్దల పట్ల అంతో ఇంతో గౌరవంతో కూడిన భయమైనా ఉండాలి అనుకున్నాడు బ్రహ్మం.

పిల్లల తొండల వేటలో బ్రహ్మం తన బాల్యాన్ని వెతుక్కున్నాడు. గుట్టకింది తుమ్మకుంటలో ఊపగడ్డి రిక్కల సాయంతో తాను చిన్న చిన్న ఎండ్రకాయల్ని పట్టేవాడు. పట్టి అటూ ఇటూ ఆడించి తిరిగి కుంట నీళ్ళలోకి వదిలివేసేవాడు. ఆ ఎండ్రకాయలు ముందరి కొండ్లూ, వెనక కాళ్ళూ నీళ్ళల్లో ఆడించి, ఆడిస్తూ నీళ్ళల్లోకి పోతోంటే అదొక ఆనందం. ముందుకూ, పక్కలకూ నడిచే వాటి నడక విచిత్రంగా ఉంటుంది. తన సావాసగాళ్ళు మాత్రం చిన్నచిన్న తొండల్ని తరిమి తరిమి చంపేవాళ్ళు. వాటిని తాడుకు గట్టి, కుంట రాతి గట్టుమీద కూర్చొని నీళ్ళలోకి వదిలేవాళ్ళు. ఎండ్రకాయలు ఆ ఎర – ఆ తొండల మాంసం కోసం వచ్చేవి. కొండ్లతో పట్టేవి. వీళ్ళు నెమ్మదిగా తాడు లాగి గబుక్కున పట్టుకునేవాళ్ళు. పెద్ద వాటి కొండ్లను విరిచేవాళ్ళు. పొట్ట తీసి గుడ్లున్నాయో లేదో, పిల్లలున్నాయో లేదో చూసేవాళ్ళు. ఒకరిద్దరు పట్టిన వాటిని కాల్చి కరకరా నమిలి తినేవాళ్ళు. అది తనకు ఏదో బాగుండేది కాదు. ఈ పిల్లలు ఎండ్రకాయల కోసం తొండల్ని చంపడం లేదు. తుమ్మకుంటలో నీళ్ళు లేవు. మరెందుకు చంపుతున్నట్లు? మనిషి స్వత సిద్ధంగా హింసాజీవి ఏమో! అదేమిటి? భారతంలో పద్యం “హింసనం చేయనివాడు లేడిజ్జగంబున...” రాములమ్మది కుల హింస, అమ్మది ఇంటి హింస.

గోడ కంతలోంచి తోటలోకి వెళ్తూ, బ్రహ్మం తమ తోటనంతా కలయ చూశాడు. ఒక ఎకరాలో ఉల్లి, మరొక ఎకరాలో మిరప, మరో మూడు ఎకరాల్లో పత్తి వేసి ఉన్నది చూశాడు. కయ్యలో ఉల్లిగడ్డలు బాగా ఊరలేదు. దాదాపు అన్నీ అక్కడో ఇక్కడో వదో పరక తప్ప. పత్రికల ఫోటోల్లో చూసిన ఇథియోపియాలో కరువు వాత పడిన పిల్లలున్నట్లు అనుకున్నాడు. మిరప ఏపుగా పెరిగింది. కాయ పట్టింది. పత్తి మొలకలు బెత్తెడెత్తున్నాయి. గాలికి ఊగుతూ, ఊరిస్తూ. వార్తల్లో చదివిన నిన్న మొన్న జరిగిన తెలంగాణ పత్తి రైతుల ఆత్మహత్యలు గుర్తుకొచ్చాయి. వికలపరిచే ఆ ఆలోచనల నుంచి తప్పించుకోడానికి బ్రహ్మం వదిన కోసం, కొండయ్య కోసం అటూ ఇటూ చూశాడు.

దోకి తెచ్చిన గడ్డిని బోరు బావి గట్టున ఖాళీ స్థలంలో వదిన కుప్పగా వేస్తోంది. కొండయ్య మిరప పాదులకు నీళ్ళు గడుతున్నాడు. దగ్గరకు వెళుతూనే వదిన నవ్వుతూ పలకరించింది, “నువ్వే అన్నం తెచ్చావా” అంటూ. ముప్పయ్యేళ్ళ వదిన ముఖంలో అలసట, శ్రమ మూలంగా పైబడిన వయసూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ‘అమాయక కష్టజీవి నవ్వు అది’ అని బ్రహ్మం అనుకున్నాడు. అన్నం గంప కింద బెట్టి, “నువ్వు ముందు తిను వదినా, ఈలోగా కొండయ్య తాతను పిల్చుకొని వస్తా” అంటూ బ్రహ్మం మిరప తోట వైపు నడిచాడు. మడవ తిప్పి కొండయ్య, బ్రహ్మాన్ని పలకరించాడు “సెలవుకొచ్చినావా, చూసిపోదామని?”

“అవును తాతా. రేపు మళ్లా పోవాల. నువ్వు అన్నం తినిరా. అంతలో నేను మడవ గడతా” అన్నాడు బ్రహ్మం నిండు మనసుతోనే.


“రెండు కయ్యలే ఉన్నాయి. నువ్వు పోయి మోటరు ఆపిరా. నీతో చెప్పాల్సింది ఉంది. తర్వాత తింటా” అన్నాడు కొండయ్య.

బ్రహ్మం మోటరు ఆపటానికి తిరిగి వచ్చాడు. వదిన అన్నం తింటోంది. బ్రహ్మం మోటరు ఆపాడు. వదిన చనువుగా నవ్వులాటగా అడిగింది. “నీ పెళ్ళెప్పుడప్పా?”

“కష్టపడడానికా వదినా? ‘నిన్నులాగా కష్టపెట్టడానికా వదినా’ అని బ్రహ్మం అందామనుకున్నాడు. అనలేకపోయాడు.

“ఉద్యోగం దొరికింది గదప్పా”

“విద్యావాలంటీరు ఉద్యోగం వదినా!”



"పదైదు నూర్లు వస్తుందటనే?"

"అది మాట వరసకేలే వదినా. చేతికొచ్చేది ఏడు నూర్లేలే."

"ఏందోనప్పా ఇదంతా. మా చిన్నాయన కూతురు టీచరుండి. కట్నం ఇచ్చుకోలేరు. చేసుకో. అప్పుడు ఇద్దరి సంపాదనలు. నా బిడ్డల్నిద్దర్నీ నీ దగ్గర విడుస్తాలే. ఆడపిల్లలు. బరువు కాదులే. ఇంటిపని అదీ చేసి చదువుకుంటారు. మీ చిన్నన్న పిల్లలు విజయవాడలో బాగా చదువుకుంటున్నారు. పెళ్ళి చేసుకో తొందరగా."

"చేసుకోవాలనుకుంటే నీ మాటే వింటాన్లే వదినా. కొండయ్య తాతను పిలుచుకొని వస్తా ఉండు" అంటూ బ్రహ్మం కదిలాడు. వదిన మనసులోని వ్యథ అర్థమైంది.

కొండయ్య చివరి కయ్యకు నీళ్ళు మళ్ళించి, కాలవలో చేతులు కడుక్కుంటున్నాడు. బ్రహ్మానికి దక్షిణం వైపు గట్టుమీదున్న నాలుగు పెద్ద తుమ్మ చెట్లు ఎండిపోయి కనిపించాయి. వాటి మీద తాట పూర్తిగా ఒలిచేసినట్లుంది. తెల్లగా కనిపిస్తున్నాయి.

"అదేమిటి కొండయ్య తాతా! ఆ చెట్లు అట్లా ఉన్నాయి" అని బ్రహ్మం అడిగాడు.

"అదా? బోరు పక్కన ఖాళీ జాగాలో తుమ్మకంప కట్టెలు చూల్లేదా?" కొండయ్య అడిగాడు.

"సరిగ్గా చూల్లేదులే, వదినతో ఏదో మాట్లాడతా. ఇంతకూ ఆ చెట్లకేమైంది.?"

"తోలు ఒలిసినారు అంటారే అది." కొండయ్య పరిహాసంగా అన్నాడు.

"ఎందుకు? ఎవరు?"



"నీతో మాట్లాడాలన్నానే. ఇదీ ఒకటి. ఇది చెప్పేముందు ఇంకొకటి చెప్పాలి. ఈ పత్తి వెయ్యొద్దు నాయనా అన్నా మీ అన్నతో. పోయిన ఏడు పెద్ద కుసుమలు (పొద్దుతిరుగుడు విత్తనాలు) వెయ్యొద్దు అన్నా. ఇప్పుడూ వినలేదు, అప్పుడూ వినలేదు. విత్తనాలు కల్తీ, మందులు కల్తీ, నీళ్ళ పారకం ఇబ్బంది. వద్దు నాయనా అన్నా. ఆశ! లప్పలప్ప ఏదో ఒకేసారి వస్తుందని ఆశ. కూరగాయలూ అవీ వేసుకోమంటే ఆ చిల్లర పంటలు వద్దంటాడు. అది కమ్మోళ్ళ సేద్యమంటాడు. అందుకేలే ఏకంగా దొంగ సారాయి కూడా వండిస్తున్నాడు మీ అబ్బకు తెలియకుండా. మీ నాయన ఎవర్నీ ఏమీ అనలేనోడు."

బ్రహ్మం ఆశ్చర్యపోయాడు నమ్మలేనట్లు. కొండయ్య మళ్ళీ ఎత్తుకున్నాడు. "నువ్వడిగినావే, ఆ చెట్లకేమైందీ అని. నేను తోలు ఒలిసినారని తమాసకు అన్నానా? మన తోటలో తుమ్మ తాటంతా సారాయికి పని కొచ్చింది. రైతులు కష్టపడి పనిచేసి, తాము తిని ఒకరికింత పెట్టే కాలం పోయింది బ్రహ్మం! కొంపలు కూల్చి అయినా సరే, అడ్డదిడ్డంగానైనా సంపాయిస్తేనే మొగోడు, లేకుంటే సేతగానోడు."

కొండయ్య లోలోపలి బాధను బ్రహ్మం అర్థం చేసుకోడానికి ప్రయత్నించాడు. తానేమీ బదులు చెప్పలేడు. చెప్పలేకపోయాడు. అరకొర చదువు అనుభవానికి దూరం!

"మీ అబ్బను చూసినా, నిన్ను చూసినా కడుపు నిండుతుంది. మీ అబ్బతో ఈ సంగతి చెప్పలేను. నీతోనన్నా చెప్తామని చెప్పినా. మనసు కుదటపడింది. పద!" కొండయ్య అన్నం గంప దగ్గరకు నడిచాడు.

బోరు బావిగట్టున ఒక మూలలో పేర్చిన తుమ్మ కట్టెల్ని బ్రహ్మం చూశాడు. ఒక్క కట్టెకు కూడా తాట లేదు. తెల్ల తుమ్మ చెక్క సారాయి అని చెప్పుకునే వాళ్ళు. ఇప్పుడు చీకుతుమ్మ చెక్క, సారాయి అన్నమాట. అమ్మ పొయ్యిలోకి కట్టెలు కావాలన్న సంగతిని కొండయ్యకు చెప్పి ఇంటి దారి పట్టాడు.

రెండు వారాలకో, నెలకో ఏ ఆదివారమో ఒకటి రెండు సెలవు లొస్తే స్వగ్రామానికి వచ్చే బ్రహ్మానికి ఈ ఆదివారం అనుభవాలు కొంత కుదుపు నిచ్చాయి. ఆలోచించడం కంటే జీవించడం నేర్చుకోవాలేమో అనుకున్నాడు. సోమవారం ఉదయానికి విద్యా స్వచ్ఛంద సేవక పదవీ నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించడానికి యాభై మైళ్ళ దూరంలోని గ్రామం చేరుకున్నాడు. కొండలూ గుట్టలోని ఊరు అది.

మరునటి ఆదివారం. మండల కేంద్రంలోని ఉద్యోగ నిరుద్యోగ మిత్రులతో బ్రహ్మం ఆ ఆదివారం గడపాలనుకున్నాడు. ఆరో తరగతి నుంచి డిగ్రీ దాకా మంచి నేస్తుడు రాజా అక్కడ రిపోర్టరు. బ్రహ్మచారి. గదిలోనే ఉన్నాడు. మరో ఇద్దరు రిపోర్టర్లు అక్కడున్నారు. వార్తలు రాయవలసిన కార్యక్రమాల హడావిడులు లేనట్లు న్నాయి. కబుర్లలో పడ్డారు. పత్రికల కబుర్లు, అధికార్ల కబుర్లు, రాజకీయుల కబుర్లు, గ్రామ స్థాయి నుంచీ అంతర్జాతీయ స్థాయి దాకా మాటల్లో దొర్లిపోతు న్నాయి. తాము పత్రికల్లో రాసిన వార్తలనూ, వార్తా కథనాలనూ ఒకరివి మరొకరు మెచ్చుకోవాలని తాపత్రయపడుతున్నారు. ఒక క్రమమంటూ లేని ఆ చర్చల మధ్యకు, ఇటీవల రాజు రాసిన సీమ ఫాక్షన్ రాజకీయాలు అనే వార్తాకథనం వచ్చి కూర్చుంది.

"మనిషి సాంఘిక జంతువు, రాజకీయ జంతువు లనేవి కొంతే నిజం. అసలు నిజం! మనిషి క్రూర జంతువు. పరస్పర హరణోద్యోగం మనిషి సహ జాతం. జనం హింస, జనం పేరుతో హింస రకరకాల పేర్లు మాత్రమే." ఒక రిపోర్టరు మిత్రుడు అనడంతో చర్చమంట రాజుకుంది.

"రాయలసీమ గ్రామాల్లోని ముఠాల కక్షల గురించి మాట్లాడుతున్నాం" అన్నాడు రాజా.

"ముఠాలు, ఫాక్షన్లు, ఫాక్షనిస్టులు, పాలెగాండ్లు అనే మాటలు కోస్తా జిల్లాల వాళ్ళు కల్పించిన మాటలు. గురజాలలో, నరసరావుపేటలో, విజయవాడ నడి బొడ్డులో, రామచంద్రపురంలో జరిగిన హింసల మాటేమిటి? సోడా బాటల్లు, సైకిల్ చైన్లు, బిచువాల కంటే, వేట కొడవళ్ళూ ఈటెలు, బాంబులూ ఎక్కువేమిటి, తక్కువేమిటి? ఇప్పుడన్నీ ఒకటే. ఇప్పుడంతా ఒకటే. సర్వం హింసమయం" అన్నాడు మరో రిపోర్టరు మిత్రుడు.

"అది కాదు మిత్రమా! ఒకప్పుడు అనంతపురం ప్రశాంతంగా ఉండేది కదా! ఇప్పుడు కడప హింసా సంస్కృతి ప్రభావమేనంటున్నారు. మిగతా చోట్లకు పాకింది అంటున్నారు" అన్నాడు రాజా రెచ్చగొడుతూ.

మరో రిపోర్టరు మిత్రుడిది కడప జిల్లా.

మొదటి రిపోర్టరు మిత్రుడు రాజుతో అన్నాడు.

"మనది వట్టి పోలీసు లెక్కల తర్కం. నేననేది ప్రతి హింస, రాజ్యహింస, విప్లవ హింస, మానవ హక్కుల హింస అన్నీ మనిషి హింసకు సంకేతాలేనని. ఒకటి గంగా నదిలా పవిత్రమైంది కాదు. మరొకటి మురికి కాలువలా చండాలమైందీ కాదు, ఆఖరుకు నక్సలైట్ల హింస కూడా. అంతే!"

"ఏందిరా నీ కాలజ్ఞానం" అన్నాడు రాజు.

"మారిన సంస్కారంతో పాటు హింస తగ్గుముఖం పట్టాల కదా? అటువంటి ఉద్వేగాలు హింసకు మూలం అనుకుంటాను. అవి పరిణామంలో తగ్గుతూ పోవాల కదా?" బ్రహ్మం మిత్రులతో చర్చలో తలదూర్చాడు.

"అంతే?" అన్నారు ముక్తకంఠంతో ముగ్గురు రిపోర్టర్లూ.

"నాకు సమాధానమేదో తెలుసునని కాదు. మనిషి మనిషిగా ఎదిగే కొద్దీ హింస తగ్గాల కదా?" బ్రహ్మం మిత్రుల ప్రతిస్పందన కోసం ఆగాడు.

మొదటి రిపోర్టరు ఇల్లు అదిరేలా నవ్వి నవ్వి, నవ్వును ఆపుకుంటూ అన్నాడు.


"మనిషి ఎదగడమా? ఆఫ్ఘనిస్తాన్ - తాలిబాన్లో ఎదిగాడు. కొసావోలో ఎదిగాడు! చైనాలో తియాన్మిన్ స్క్వేయిర్‌లో ఎదిగాడు! పాకిస్తాన్‌లో ఇంతెత్తున ఎదిగాడు. ఇండియాలో ఎక్కడ బడితే అక్కడ - ఢిల్లీలో, బీహార్‌లో, తమిళ నాడులో, ఆంధ్రలో ఏమిటి? అన్నిచోట్లా ఎదిగి ఎదిగి కూలబడ్డాడు. అంతర్జాతీయ ఏకైక పోలీసు అమెరికా, ప్రజాస్వామ్య పరిరక్షణలో, విశ్వశాంతి పరిరక్షణలో మరీ ఎదిగి పోతున్నాడు. ఆత్మ సమర్థన చేసుకునే ఏ జాతి అయినా తనను తాను వంచించుకుంటుంది. ఇతరుల్ని వంచిస్తుంది. దానికి వర్తమానం ఉంటుంది. భవిష్యత్తు ఉండదు."

"ఒరేయ్, ఒరేయ్! వేమన్న లాగా శాశ్వత సత్యాలు చెప్పకురా. పోతులూరి వీరబ్రహ్మంలాగా భవిష్యత్తు పలకకురా" అన్నాడు రాజు నవ్వుతూ.

"శ్రీశ్రీ హింస, రిరింస అనే రెండు మాటలు వాడినాడు. మీకు గుర్తుందరా?" మొదటి రిపోర్టరు అడిగిన ప్రశ్నకు జవాబు రాజుకూ, రెండో రిపోర్టరుకూ తోచలేదు.

బ్రహ్మం అన్నాడు, "గుర్తుంది. రిరింస అనే మాటకే అర్థం స్ఫురించలేదు."

మొదటి రిపోర్టరు మళ్ళీ పసిపిల్లలు జడుసుకునే నవ్వు నవ్వాడు. నవ్వు ఆపకుండా "రి... రి... రిరిం... రిరింస... రిరింస ఒక హింస" అన్నాడు.



"వీడు చెయ్యబోయే కవిత్వ హింస ఎందుకు గానీ, మనం లైన్ అకౌంటు హింసను గురించి మాట్లాడుకుందాం." రాజు వాతావరణాన్ని తేలిక పరిచే ఉద్దేశంలో అన్నాడు.

"ఇదేమిటి?" బ్రహ్మం ఆశ్చర్యంతో అడిగాడు.

వార్తల కొలతలను బట్టి పత్రికలిచ్చే ప్రతిఫలాన్ని గురించీ, ప్రతిఫలం కోసం సాగతీసి సాగతీసి రాసే వార్తల గురించీ రాజు చెప్పసాగాడు- నవ్వుల మధ్య కథలు కథలుగా. ఇద్దరు రిపోర్టరు మిత్రులు పని ఉందంటూ వెళ్ళిపోయారు. రాజుతో కలిసి మధ్యాహ్నం వంట కబుర్లు, భోజనం, కబుర్లు, నిద్ర, టీ, కబుర్లు...

సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో సొంత ఊరి నుంచి సుడిగాలిలా వచ్చిన దాయాదిని చూసి బ్రహ్మం ఆశ్చర్యపడిపోయాడు. ఆ కుర్రాడు వణికిపోతూ, ఏడుపు గొంతుతో, పొందికంటూ లేకుండా చెప్పాడు. 'మన సిద్దారెడ్డి అబ్బను పొద్దున తాడిపత్రి బస్టాండులో వేట కొడవళ్ళతో నరికి, బాంబులు వేసి ఘోరంగా చంపి పారిపోయినా'రని, 'తన కోసం తానుండే పల్లెకు పోయి ఇక్కడున్నాడని తెలుసుకొని వచ్చేసరికి ఇంతటయం అయిం'దని. బ్రహ్మం నిశ్చేష్టుడయ్యాడు. రాజుకు బ్రహ్మాన్ని ఎట్లా ఓదార్చాలో దిక్కు తెలియలేదు. వెంటనే చెయ్యవలసింది గుర్తుకొచ్చింది. "నువ్వు రూమ్‌లోనే ఉండు. కమాలుద్దీన్ అని ఒక మిత్రుడున్నాడు. అతనికి మోటార్ సైకిలుంది. అడిగి తెస్తాను. మీ ఊరికి ముగ్గురం కలిసి వెళ్ళవచ్చు" అన్నాడు- హత్య జరిగినప్పుడు జరిగే గుర్తింపులూ, విచారణలూ, పంచనామాలూ, పోస్టుమార్టమ్‌లూ, పోలీసుల కేసు నమోదు తతంగాలూ- వీటికయ్యే వ్యవధిని గురించి ఆలోచిస్తూ. "ఊరికి పోవడమే మంచిది. అయినా, తాడిపత్రిలో మా పత్రిక రిపోర్టరుకు ఫోన్ చేసి ఎక్కడికి వెళ్ళాల్సిందీ నిర్ణయించుకుందాం" అంటూ రాజు బయటికి వెళ్ళాడు.

బ్రహ్మానికి ప్రతి క్షణానికీ ఆందోళన పెరుగుతూనే ఉంది. అది ఆందోళనో, దుఃఖంతో బరువెక్కిన మనసో, హత్యకు కారణాలను వెతికే ఉద్వేగమో, కుటుంబం ఏ కల్లోలంలో చిక్కుకుంటుందో అనే భయమో, ఏది ఏమో తెలియని స్థితి. బ్రహ్మం, బ్రహ్మం కోసం వచ్చిన కుర్రాడూ మాటిమాటికీ తలుపు వైపు చూస్తున్నారు. ఉలికి ఉలికిపడుతూ బయట శబ్దాలను వింటున్నారు. గంట గడిచింది. మోటార్ సైకిల్ శబ్దం తలుపుకు దగ్గరగా ఆగింది. ఆగడంతో బ్రహ్మం చివాలున లేచి నిలబడ్డాడు. "పోదామా?" అక్కడికి, ఎక్కడికి అనే ఆలోచన లేకుండా.

"మనం మీ ఊరు చేరుకునేసరికి, శవం మీ ఊరికి వస్తుంది. మా రిపోర్టరుతో మాట్లాడినా, పద పోదాం." రాజు వివరాలు చెప్పలేదు. బ్రహ్మం అడిగే స్థిమితంలో లేడు.

ఊరు లోపలికి ప్రవేశిస్తూనే బ్రహ్మం గుండె దడ హెచ్చింది. ఇంటి దగ్గర జనం గుంపులు గుంపులుగా. పల్లెల జనం. కొందరాడవాళ్ళు చంపినవాళ్ళ మీద శాపనార్థాలు పెడుతున్నారు. కొందరు మగవాళ్ళు చనిపోయిన సిద్దారెడ్డి గుణగణాలను కీర్తిస్తున్నారు. బ్రహ్మం బంధువులైన యువకులు చంపింది ఎవరెవరో తెలిస్తే నరికి పోగులు పెట్టాలని బీరాలు పలుకుతున్నారు. వీళ్ళందరి మధ్యా ఏ సిద్ధుడి ముఖంలాగానో కనిపించే సిద్దారెడ్డి ముఖం. సైను గుడ్డతో కుట్టివేసి దుప్పటి కప్పిన శవం. అబ్బ శవాన్ని చూసి బ్రహ్మం దుఃఖం పెల్లుబికింది. బోరుబోరున విలపించాడు. రాజు పొదివి పట్టుకున్నాడు. ఓదార్పులేని అశక్తత.

గుంపులోని ఒక పెదరాలు అంది: "ఒకర్ని అని ఎరగడు. యాభై యేండ్లలో ఒకరి మీద చెయ్యెత్తగా వినలేదు, ఇంట్లోవాళ్ళ మీద కూడా. నేను చూడలేదు. పేదాసాదాను అట్లా చూసినోడు లేడు. రాకాసోళ్ళు





మునలాయన్ని పొట్టనబెట్టుకున్నారు."


మరెవరో అన్నారు: "ఈ పెద్దాయన పెదపెద్దోళ్ళతో పెట్టుకున్నట్లుంది. లేకపోతే ఈయన జోలికి పొయ్యేవాండ్లెవరు? ఎప్పుడూ ఏ పార్టీల్లోనూ తలపెట్టినోడు కూడా కాదు."

"ఖర్మ! ఖర్మ!" అని ఎవరో గొణిగారు.

బ్రహ్మం తల్లీ, వదిన తలలు చేతులతో కొట్టుకుంటూ ఏడుస్తున్నారు. చుట్టాల ఆడవాళ్ళు, బీదా బిక్కీ స్త్రీలూ వాళ్ళను ఓదార్చడానికి చేసే ప్రయత్నంలో తామూ ఏడుస్తున్నారు. అక్కడ సామూహిక వేదనా, సంఘ దుఃఖం కన్పిస్తున్నాయి.

సిద్ధారెడ్డి శవ ఖననం అయ్యిందాకా, ఊరు ఊరంతా పురుగుల వాతబడిన పత్తిపంట లాగుంది. హంతకుల ఆచూకీ మాత్రం తెలియలేదు. పోలీసులు గాలిస్తూనే ఉన్నారు. దివసం మాత్రం జరిగిపోయింది. దివసం జరిగిపోయిన రాత్రీ, ఆ మరునటి రోజూ చూడలేక విన్నవాటితో బ్రహ్మం మానసికంగా తలకిందులయ్యాడు.

దివసం జరిగిపోయిన రాత్రి ఇంటిబయట జాగా లేక, ఇంట్లో కరెంటు పోయి తాను దొడ్లో పడుకున్నాడు. అటుపక్కగా విజయవాడ నుంచి వచ్చిన రెండో అన్న, ఆయన భార్య ఒకే మంచంలో పడుకున్నారు, దోమతెర కట్టుకొని. తన పక్క మంచంలో పెద్దన్న బిడ్డలు ఆడపిల్లలిద్దరూ గాఢ నిద్రలో ఉన్నారు. కటిక చీకటి. ఏ అర్ధరాత్రో అపరాత్రో గుసగుసలు వినిపించాయి. నిద్ర రాక ఆలోచనలతో సతమతమవుతున్న బ్రహ్మానికి వినిపిస్తాయి. "రాజీ కమ్మనే చెప్తాను. నువ్వు చెప్పినట్లు చెప్తాలే. మునలాయన మహా బతికితే మరో నాలుగైదేండ్లు బతికేవాడు. మా నాన్న వెర్రిమాలోకం. మా అన్న ఇప్పుడిప్పుడే బతక నేర్చుకుంటున్నాడు. మా తమ్ముడికి మీ ప్రాంతంలోనే సంబంధాలు చూద్దాం. వీళ్ళు కుదుట పడితే మన మీద పడరు, ఇద్దరం ఉద్యోగులమని.



ముందుముందు మనకే లాభం ఉండొచ్చు. చూద్దాం..."

చిన్నన్న స్వరం పెద్దది. గుసగుసలైనా వినిపిస్తాయి.

చిన్నన్న మాటలకు బ్రహ్మానికి మతి పోయింది. చిన్న వదిన-విజయవాడ వదిన- మాటలు వినిపించలేదు, ఊఁ ఊఁలు తప్ప. ఒకే ఒక్క మాట- 'పాడు!' వినిపించింది.

"ఈ రోజన్నా వదిలేదు లేదా? కానీ, నువ్వు వినవు గదా" అని.

బ్రహ్మం సిగ్గుతో, అవమానంతో చచ్చిపోయాడు. 'చావు వేరు. దుఃఖం వేరు. శరీరం ఆరాటపడే సుఖం వేరు. ఇదేమిటి' అని అనుకున్నాడు.

మరునటి రోజు చాకలి రాములమ్మ దొడ్లో ఒంటరిగా కూర్చున్న తనతో ఎవరికీ వినబడకుండా చెప్పింది:

"చిన్నెడ్డి. మూడు లక్షలిచ్చి చంపించినారంట. మా చెల్లెలి ఊర్లో వాడొకడు, మా కులపోడు కూడా చంపినోళ్ళలో ఉన్నాడంట. పాపిష్ఠోళ్ళు..." ఆ తర్వాత వివరాలు ఎవరో రావడం వల్ల బ్రహ్మానికి రాములమ్మ ద్వారా అందలేదు.

ఏ నిజాలూ తెలియని స్థితిలో ఆ ఆదివారం ఆప్తమిత్రుడు రిపోర్టరు రాజు దగ్గరకు వెళ్ళి నిస్సిగ్గుగా తాను విన్నవి చెప్పాడు.

"మా పత్రిక రిపోర్టరు కూడా చెప్పినాడు మొన్న కలిసి. అన్నీ నిజమే. మీ అబ్బ సిద్ధారెడ్డి పేదలకు ఇండ్ల పట్టాలకు పట్టుబట్టి క్వారీకి, కంకరు మిషన్లు పెట్టడానికి అడ్డం తగిలాడట. పెట్టాలనుకున్న వాళ్ళకు అది ఇరవై లక్షలకు పైగా నష్టం. సిమెంటు ఫ్యాక్టరీ కొంటున్న చిన్న రైతుల, పేదల భూముల కొనుగోళ్ళ విషయంలో, వాళ్ళ దగ్గర చౌకగా బెదిరించి కొని తిరిగి ఫ్యాక్టరీ యాజమాన్యానికే అమ్మాలనుకున్న వాళ్ళకు అడ్డం వచ్చాడంట. ఇంకా..."

"ఆయన వెనుక మనుషులెవరున్నారు?" బ్రహ్మం పీల గొంతుతో ఆత్రం పట్టలేక అడిగాడు.

"అప్పటికప్పటికి ఉన్నారు. ఆయన మహాజర్లు, మొండితనం, ప్రభుత్వ పథకాల అమలు పరిధిలోనే అందుకున్న సూత్రం..."

"పత్రికలేమీ చెయ్యలేవా?"

"అంతో ఇంతో చేశాయి కాబట్టే మీ అన్నతో రాజీకొచ్చారు, మరో రెండు లక్షలిచ్చి. మీ అన్న సారా వ్యాపారానికి తలుపులు కొంత తెరుస్తామని చెప్పి..."

"మరి ఇండ్ల పట్టాలు."

రాజు బదులు పలకలేదు. దిగులుగా కూర్చున్నాడు.

"ఇంతకూ కాంగ్రెసు వాళ్ళా? తెలుగుదేశం వాళ్ళా? రెడ్లా? కమ్మవాళ్ళా? కిరాయి మనుషులా? అసలు దీని వెనకున్న మనిషి ఎవరు?" బ్రహ్మం ఆవేశంగా ప్రశ్నించాడు.

"ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, దేని కోసం, ఏ పార్టీలో, ఏ కులంలో ఉంటారో వాళ్ళను నువ్వూ, నేనూ తెలుసుకుంటూనే సరిపోతుందా? తెలుసుకుంటే ఏం జరుగుతుంది? ఊఁ ఏం జరుగుతుంది చెప్పు?" నిరావేశంగా నొక్కి నొక్కి అడిగిన రాజు ప్రశ్నలతో గ్రామ విద్యా వాలంటీరు బ్రహ్మం తపస్సులోకి వెళ్ళిపోయాడు.

ఏ తపస్సుకైనా ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక ఫలితం ఉండకపోదు. ■